# కొత్తనీరు

పోలీసు ఇన్‌స్పెక్టరు కె.వి. రమణమూర్తి తన ఎదుట నిలపెట్టబడ్డ వ్యక్తిని పరీక్షగా చూశాడు.

నడివయస్సులో వున్నాడు. మనిషి బక్కపలచగా, పీలగా, నీరసంగా వున్నాడు. మాసినగడ్డం తెల్లగా వుంది. కట్టిన పంచె మురిగ్గా వుంది. తైల సంస్కారంలేని జుట్టు చిరిగిన ముగ్గుబుట్టలాగా వుంది. ఎముకలు బయటపడ్డ ఎదురురొమ్ముమీద నుండి వ్రేలాడుతున్న జంధ్యం బయటికి కనిపిస్తోంది. వయస్సు తెచ్చిన గూని; చత్వారం తెచ్చిన కళ్ళజోడు ముక్కుపైకి జారుతూంది.

ఈ పెద్దాయనా యింటితాళం బ్రద్దలు కొట్టుతూ పట్టుబడింది? ఆ దార్నిపోయే వాళ్ళ తలా ఒకదెబ్బ కొట్టినట్టున్నారు - పాపం, ముక్కుల్లోంచి రక్తం కారి, చారిక కట్టివుంది. ఆ వ్యక్తి దొంగతనం చేయబోయాడంటే తన మనస్సుకు ఎందుకో నమ్మకం కుదరటం లేదు. అంతకు ముందెప్పుడో ఇతణ్ణి చూచినట్టుగా వుంది. పాతకేడీ మాత్రం కాదు.

అతణ్ణి స్టేషనుకు లాక్కొనివచ్చిన కానిస్టేబులు ఒక పొట్లం టేబిల్‌మీద పెట్టాడు.

అందులో చిన్న సుత్తి, సన్నటి శానం, ఒక వులీ వున్నాయి. అవి ఇతనిదగ్గర దొరికాయి. వీటితోనే యింటితాళం బ్రద్దలుకొట్టబోయి పట్టుబడ్డాడంట.

వాట్ని చూడగానే ఇన్‌స్పెక్టరు రమణమూర్తికి చటుక్కున ఏదో స్ఫురించింది.

అతణ్ణి, "నీపేరు బ్రహ్మంకదూ!" అని అడిగేడు.

అతను అవునన్నట్లు తల వూపాడు.

రమణమూర్తి అప్రయత్నంగా జేబులోంచి విజిల్ బయటికి తీశాడు. దాని మీద తనపేరు 'కె.వి. రమణ మూర్తి' అని చక్కని గుండ్రని అక్షరాలల్లో చెక్కబడివుంది.

రమణమూర్తికి ఆ విజిల్ అంటే ఎంతో ఇష్టం; ప్రాణపదంగా చూచుకుంటాడు. తను కానిస్టేబులుగా వున్నప్పట్నుంచీ ఆ విజిల్ తన దగ్గరవుంది. తనీనాడు ఇన్‌స్పెక్టరు రేంకుకు కేవలం ఆ విజల్ మూలంగానే వచ్చానన్న ఒక సెంటిమెంట్!

"నీవు పేర్లు చెక్కుతుంటావు కదా!" అని అడిగేడు.

పాపం, బ్రహ్మం తల సిగ్గుతో వాలిపోయింది.

ఎన్నో సంవత్సరాల క్రితం ఆ విజిల్ మీద తన పేరు ఈ బ్రహ్మమే చెక్కేడు.

* * *

అది అటు పల్లె ఇటు బస్తీకాని ఒక మాదిరి టౌను.

ఆ వూళ్ళోకల్లా చింతా వేంకటరత్నం ఇత్తడి సామాను కొట్టుకు పెద్ద పేరు వుంది. మెయిన్ బజార్లో దాదాపు ముప్పై సంవత్సరాల పై చిలుకునుంచీ వుంది. ప్రస్తుతం దాన్ని వేంకటరత్నం మనుమడైన తాతబ్బాయి నడుపుతున్నాడు. ఈమధ్యే స్టీలుసామాన్ల సెక్షను కూడా వోపెన్ చేశాడు. తాతబ్బాయి తండ్రి నాగభూషణం, యాజమాన్యం కొడుకుకు అప్పగించి విశ్రాంతి తీసికుంటున్నాడు.

ఆ కొట్టు అరుగుమీద కూర్చుని బ్రహ్మం సామాన్ల మీద పేరులు చెక్కుతూ రోజుకు నాలుగైదు రూపాయలు సంపాయించుకుంటూ గుట్టుగా సంసారాన్ని లాక్కొస్తొన్నాడు. బ్రహ్మం తండ్రి పరబ్రహ్మం కూడ అదేకొట్టు అరుగుమీదు కూర్చుని సామాన్లు మీద పేర్లు చెక్కుతుండేవాడు. తండ్రి పోయాక ఈ బ్రహ్మం అదే అరుగును ఆశ్రయించాడు. అది వాళ్ళ కుల వృత్తి.

ఆషాఢమాసం - అందులోనూ ఈ సంవత్సరం అధిక ఆషాఢం అవటం వల్ల రెండు నెలలుగా సరిగ్గా బేరాలు లేవు. కొట్టో బేరాలు లేకపోతే బ్రహ్మనికి కూడా బేరాలు తగలవు ఈ రెణ్ణెళ్ళూ కటకటగా వుంది. ఆషాఢం మొన్నటితో వెళ్ళిపోయింది. శ్రావణం వచ్చిన దగ్గర్నుంచీ బేరాలు పుంజుకుంటాయి. లగ్గవరి సీజను ప్రారంభమవుతుంది. పైగా క్రొత్తగా కాపురానికెళ్లే ఆడపిల్లలకు కన్నవాళ్ళు క్రొత్త పాత్ర సామాగ్రి కొని యిస్తారు. మంచి గిరాకీ. ఈ రెండు నెలలల్లో చేసిన అప్పులు తీర్చవచ్చుననుకున్నాడు బ్రహ్మం.

రాబోయే బేరాలు దృష్టిలో పెట్టుకుని షావుకారు బెజవాడ వెళ్ళి సరుకేసికొని క్రితం రోజే వచ్చాడు.

బ్రహ్మం యింటిదగ్గర్నుంచి బయలుదేరుతున్నప్పుడు ఇవ్వాళ్ళ మంచిబేరం తగలాలి స్వామి అని వేంకటేశ్వరస్వామికి దణ్ణం కూడ పెట్టుకున్నాడు.

పనిముట్లువున్న సంచిని చేతికందించిన పెద్దకూతురు లక్ష్మిని చూడగానే తన కడుపు నిండిపోయినట్లనిపించింది. లక్ష్మి కుందనపు బొమ్మలాగా వుంటుంది. తన సొంత మేనల్లుడితో పెళ్ళి నిశ్చయమయింది. దేముడు చల్లగాచూస్తే ఈ లగ్గాలకు పెళ్ళి చేసేయాలనుకుంటూ కొట్టుదారి పట్టాడు.

ఉదయప్పూట బేరాలు అట్టే వుండవు. బీడీ ముట్టించి తాపీగా త్రాగుతూ కూర్చున్నాడు - మళ్ళీ పెద్దకూతురు లక్ష్మి గుర్తుకొచ్చింది. ఎంతో వొద్దిక, అణుకువ అంతా తల్లిపోలిక, పెద్ద పిల్లంటే తనకెంతో యిష్టం. పిల్ల అందంగా వుంటుందని అయిదొందల కట్నానికే మేనల్లుడు వప్పుకున్నాడు వాడికింకా ఎక్కువ యిస్తామని బయట్నుంచి సమ్మంధాలొస్తోన్నాయి. ఈ నాల్గు నెలల్లో తనకు పని బాగా సాగితే, అయిన అప్పులు తీర్చి, నాల్గు రాళ్ళు వెనకేసి ఈ వేసవికాలంలోనే పెళ్ళి చేసేయాలి. ఈ పిల్ల పనయిపోతే మిగతా ముగ్గురూ చిన్నపిల్లలు. అంత తొక్కుళ్ళాడుకోవాల్సిన పన్లేదు.

- పదకొండు గంటలు దాటుతున్నా ఒక్కబేరం కూడా రాలేదు. విసుగ్గా వుంది. అప్పటికే మూడు బీడీలు తగలేశాడు. టీ త్రాగొద్దామని లేచాడు.

టీ త్రాగి వచ్చేసరికి ఏదో పెద్ద బేరమే వచ్చింది. బాగా డబ్బున్నవాళ్ల లాగా వున్నారు. పిల్లని

కాపురానికి పంపిస్తోన్నారంట. చిన్నా చితకా ఇరవై శాల్తీల్దాకా కొన్నారు. రెండు రూపాయలు దాక వస్తాయి. ఆశగా చూస్తూ నిలబడ్డాడు. బేరం పూర్తి అవుతుండగా, "పేర్లు వెయ్యాలా బాబుగారు?" అని అడిగేడు, వెయ్యాలి అని అన్నారు. శాల్తీలు కూడా చేత్తో తీసుకున్నాడు.

ఇంతలో చిన్నషావుకారు తాతబ్బాయి వుండి, "పేర్లు కూడా మేమే ఫ్రీగా వేస్తామండీ!" అని అన్నాడు.

తన కర్థం కాలేదు. పేర్లు ఇతను వెయ్యటమేమిటి?

"ఓహో, మీ దగ్గర కరంటు మిషన్ వుందా?" అని అడిగేడు ఆ ఆసామి.

"అవునండీ, నిన్ననే బెజవాడ నుండి తీసికొచ్చాను. ఇవ్వాళే ఓపినింగ్. మొదటిసారిగా మీ సామానుమీదే వేస్తోన్నాం!" అని, "బ్రహ్మం! వాట్ని అక్కడపెట్టు!" అన్నాడు.

తనకు నోటెంట మాటరాలేదు. శిల వేసినట్టు నిల్చుండిపోయాడు; నోరెళ్ళ పెట్టుకుని చూస్తోన్నాడు.

తాతబ్బాయి అలమరలోంచి ఒక అట్టపెట్టి తీశాడు. అందులోంచి ఒక చిన్న మెషిన్ బయటకితీసి, ప్లెగ్‌పెట్టి 'డుర్-డుర్' మంటూ చెకచెకా వాటి మీద పేర్లు వేశాడు. అంతా పావుగంటలో అయిపోయింది. వాళ్ళు 'బలేవుందే! బలేవుందే!' అని తెగ ముచ్చటపడి పోయారు.

'ఈ టవున్ మొత్తానికి ఈ మెషిన్ మనషాపులోనే వుందిసార్!' తాతబ్బాయి గర్వంగా పోజు పెట్టాడు.

అప్పటికి జరిగిందేమిటో తనకర్థమయింది; జరగవల్సిందే అర్థం కాలేదు.

నీరసంగా అరుగుమీద కూలబడ్డాడు, 'ఇలా చేశావేంటిరా దేముడా!' అని తనలో తాను మధనపడ్డాడు.

ఆరోజు మంచి తిధి అవటం వల్లనో ఏమో చాలా బేరాలువచ్చాయి. వచ్చిన ప్రతి బేరానికి తాతబ్బాయి తను క్రొత్తగా తీసికొచ్చిన ఆ మెషిన్ చూపించి గొప్పగా డబ్బా కొట్టుకుంటూ తనే పేర్లు ఫ్రీగా వేశాడు.

"మాకా మిషన్‌తో వద్దు. మేం ఈ బ్రహ్మంచేత పేర్లు వేయించుకుంటాం" అని ఏ ఒక్కరైనా అంటారేమోనని వచ్చిన ప్రతివార్నీ ఆశగా, తన మామూలు ధోరణిలో అడిగాడు.

తాతబ్బాయి తన మీద విసుక్కున్నాడు. "ఇంకా నీచేత ఎవరు పేర్లు వేయించుకుంటారయ్యా. వేరే కొట్టు చూచుకో!" అని తన మొగాన అనేశాడు కూడ!

తనేం మాట్లాడలేదు. ఆ రోజు గిరాకీకి తనకు దాదాపు పది రూపాయలు వచ్చివుండేవి. ఈ తాతబ్బాయి తన నోటికాడ కూడు తీసేశాడు; తన కడుపుమీద దెబ్బకొట్టాడు.

రోజూ కంటే తొందరగా, వుత్తచేతులతో, ఖాళీ జేబుల్తో, కాళ్లీడ్చుకుంటే యింటికెళ్ళాడు. చిన్నపిల్లలు కాళ్ళకు చుట్టుకున్నారు. రోజూ తను ఏదైనా తినుబండారం తీసికొచ్చేవాడు.

కుక్కిమంచంలో మునగదీసుకుని పడుకున్నాడు. "జ్వరం ఏమైనా వచ్చిందా?" అని భార్య కంగారు పడింది. పొరుగిటికి పేరంటానికెళ్ళటానికి తయారైన పెద్ద కూతురు లక్ష్మి దిగులుగా

మొగంపెట్టి, "నాన్నకు వంట్లో బాగోలేదు. నేను యింట్లోనే వుండిపోతాను!" అంది. పిచ్చిపిల్ల, నాకేదిలేదని చెప్పి పంపించాడు.

పేరంటానికయితే తేలిగ్గానే పంపించాడు. రేపు పెళ్ళి చేసి మరో యింటికి ఎలా పంపించగలడు?

భార్యా, కూతురూ బ్రతిమాలినా, ఆకలిగా లేదని చెప్పి ఆరాత్రి భోజనం చెయ్యలేదు. ఎప్పటికో పట్టిన కలత నిద్రలోకూడా ఆ మాయదారి మిషనే కనిపించింది. మూరెడుకూడ లేని ఆ మిషను వుండి వుండి ఎన్నో బారలు పెరిగిపోయింది. నిప్పులు చిమ్ముతూ ఒక రాక్షసిలాగా తన మీదమీదకు వస్తోంది; తను భయంతో పరుగెత్తుతున్నాడు. తనెక్కడికి పోయినా అది తనను తరుముతూనే వుంది. తను భయంతో కేకపెట్టాడు ఇంట్లోవాళ్ళు కంగారుగా లేచారు.

మర్నాడుకూడా మామూలు అలవాటు ప్రకారం, తన పనిముట్లు సంచి తీసుకుని బయలుదేరాడు.

తనను చూచి తాతబ్బాయి చిరాగ్గా మొగం పెట్టేడు.

మరోకాసేపటికి ఏదో బేరం వచ్చింది. శాల్తీకి అయిదు పైసలకే పేర్లు వేస్తానని తను ప్రాధేయబడ్డాడు. అయిదుపైసలయినా ఎందుకిస్తారు? ఫ్రీగా మిషన్ మీద చిటెకలో వేస్తూంటే. పైగా మిషన్‌తో పేరు వేయించుకోవటం అదొక గొప్ప!

"మామీద పోటీనా? మరో దుకాణం చూచుకోమంటే వినవేఁటి?" తాతబ్బాయి పెద్దగా అరిచేడు.

తనకెంతో చిన్నతనమనిపించింది. ఛీ! వీడితో ఏఁటి అనిపించింది. మళ్ళీ ఆ కొట్టూ, ఆ అరుగూ అంటే ఏదో తెలియని మమకారం. దాదాపు పాతిక సంవత్సరాల్నుంచి, తాతబ్బాయి తండ్రి హయాం నుంచీ తనా అరుగుమీద కూర్చుంటున్నాడు; ఈ కొట్టునే నమ్ముకున్నాడు. తన తండ్రికూడ ఆ అరుగు మీదే కూర్చునేవాడు. అది తాతబ్బాయి తాతహయాం. ఇవ్వాళ ఈ కుర్రనాగమ్మ వచ్చి తనను పొమ్మంటున్నాడు?

పోకుండా ఈ అరుగునే అంటిపెట్టుకుని ఏంచెయ్యాలి? పొట్టలు నిండేదెలా, యిల్లు గడిచేదెలా? మమకారాలు వదులుకోవాలి.

కాళ్ళీడ్చుకుంటూ రాజులకొట్టుకేసి వెళ్ళాడు. ఆ కొట్టును ఆశ్రయించుకొని వున్న రంగాచారి తనను జాలిగా చూశాడు.

"తాతబ్బాయి బెజవాడ నుండి మిషన్ తీసికొచ్చాడంటగా! మా షావుకారు కూడ వచ్చేవారం తీసికొస్తానంటున్నాడు." అని దిగులుగా అన్నాడు.

అతనే మళ్ళీ అన్నాడు: "మా షావుకారు కష్టం సుఖమూ తెలిసినవాడే; మంచివాడే! కాని ఈ కొంటానికొచ్చే వాళ్ళే చింతావాళ్ళ కొట్లోవుంది మీ కొట్లో లేదా అంటున్నారు!"

తను కాళ్లీడ్చుకుంటూ అక్కడ్నుంచి వచ్చేశాడు.

పదిరోజులు తిరగకుండానే ఈ ఊళ్లో వున్న మిగతా మూడు దుకాణాలల్లో కూడ ఈ మిషన్లు వచ్చేశాయి. ఆ దుకాణాలనే ఆశ్రయించుకుని ఈ వృత్తిమీద బ్రతికే మిగతా ముగ్గురుకూడా నిరాధారులయిపోయారు. తలా వొక దారై పోయారు.

తన యిల్లు గడవటం కష్టంగా వుంది. ఇంట్లోవున్న చిన్నముమూ చితకా అమ్మేసి గడుపుకొస్తోన్నాడు.

తన పాత అలవాటును మాన్చుకోలేక, షావుకారు కొట్టు అరగుతో తనకున్న అనుబంధాన్ని త్రెంచుకోలేక, పనివున్నా లేకపోయినా రోజూవెళ్ళి ఆ అరుగు మీద కూర్చొని వస్తాడు. కొన్ని రోజులు ఆ ఊళ్ళో వున్న ఒక కంచరికొట్టు కెళ్ళి అక్కడ జరిగే పనిపాటలు చూచివచ్చాడు. ఆ పని తనకు రాదు; క్రొత్తగా పనినేర్చుకునే వయస్సు కాదు ఇది. తనకొచ్చిన పని చేస్తాను, తోచినంత యివ్వమని ప్రాధేయబడ్డాడు. మాకే చేతినిండా పనులు లేవు, నీకేం పని ఇవ్వము అన్నారు.

ఆ రాత్రి వచ్చిన కలే ప్రతి రాత్రీ వస్తోంది. నిద్రలో భయంతో వణికి పోతున్నాడు; ఏవో పలవరింతలు, ఈ మామ్మారిలాంటి మిషనూ తన నాశనం చూడనిదే వదలదనే భయం పట్టుకుంది. ఒక రాత్రి సమయానా లేచి బుడ్డిదీపం పెట్టుకుని యింట్లోవున్న ఒకే ఒక పాత యిత్తడి బిందెమీద టక్ టక్ మంటూ పేర్లు చెక్కుతూ కూర్చుంటున్నాడు. తనపేరు, తండ్రిపేరు, తాత ముత్తాతల పేర్లు చెక్కుతున్నాడు. కొన్నిరోజులకు ఆ బిందెమీద పేరులేని చోటులేకుండా పోయింది. తన పిచ్చివాలకం చూచి భార్యా, పిల్లలూ బెంబేలు పడిపోతున్నారు.

- నెల గడిచేసరికి యిక యింట్లో అమ్మవల్సిన సామాన్లు మిగలలేదు. మిగిలిందల్లా మనుషులూ, పస్తులున్నూ! చిన్నపిల్లలు ఆకలికి తట్టుకోలేక విలవిల్లాడిపోతున్నారు. వాళ్ళబాధ చూడలేక రోజూ చుట్టుప్రక్కల వున్న పల్లెటూళ్ళకెళ్ళి, 'సామాన్ల మీద పేరులేస్తాం!' అని అరుచుకుంటూ తిర్గివస్తోన్నాడు. ఎంత తిరిగినా, ఎన్నాళ్ళు తిరిగినా, ఎంత అరిచినా రూపాయి డబ్బులన్నా రావడంలేదు! ఒక్కో రోజున అవీ వుండవు. ఆ డబ్బులతో ఇంతమంది పొట్టలు ఎలా నిండుతాయి? తిరగవల్సిన వూళ్ళు కూడా అయిపోయాయి. తనకు తెలియకుండా భార్య పాచిపనులకు కూడ పోతూంది.

తను చితికిపోయేసరికి మేనల్లుడు వేరే సమ్మంధం చేసుకున్నాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక తన బంగారుతల్లి లక్ష్మి బలవంతం చావు చచ్చింది; తనని దగా చేసిపోయింది. కూతురు చావు తనని కృంగదీసింది. ఆ షాక్‌నుంచి తేరుకునేసరికి నెలరోజులు పట్టింది. భార్య పుస్తుల త్రాడు కూడా అయిపోయింది. ఎలాగో గుండెరాయి చేసుకుని లేచి మొండిగా తిరుగుతున్నాడు. మిగిలిన పిల్లలనయినా దక్కించుకోవలనుకున్నాడు.

మళ్ళీ బజారుకు రావడం మొదలుపెట్టాడు. ఈ మాయదారి మిషన్ మూలంగా బాగా చితికిపోయిన రంగాచారి వాళ్ళ గురించి ఘోరవుదంతాలు విన్నాడు. రంగాచారి మార్కెటులో మూటలు మోస్తూ సంసారం ఈడ్చుకొస్తోన్నాడు. మర్ బ్రహ్మం బెజవాడలో రిక్షాలు తొక్కుతున్నాడు. మరొకడు దొంగ సారా అమ్ముతున్నాడు.... ఏమీ చేతకానివాడు, ఏమీ చేయలేని వాడు తనే!

మూడ్రోజుల్నుంచి భార్యకు జ్వరం. మూసినకన్ను తెరవకుండా పడివుంది. ఆ పాచిపనికి కూడా పోవడం లేదు. పిల్లలు ఆకలికి గిలగిల్లాడి పోతున్నారు. అందరికి ఎలుకుల మందు యిచ్చి తనూ త్రాగుదామనుకున్నాడు. మళ్ళీ మనస్సు అందుకు అంగీకరించలేదు.

రెండు రోజుల్నుంచి చీకటి పడ్డాక నెత్తినిండా ముసుగుకప్పుకొని బ్రాహ్మణ వీధికెళ్ళి మాధాకవళం

అడిగి అన్నం తీసికొచ్చి పిల్లలకు పెట్టుతున్నాడు. ఇవ్వాళ రాత్రి అలా మాదాకవళం అడుగుతూ యింటింటికి తిర్గుతున్నప్పుడు ఒక యింటికి తాళం వేసి వుండటం చూశాడు. అది ఒక చౌదరి గారి యిల్లు. ఆయనకు బాగా డబ్బు ఉంది. ఇంటిల్లపాదీ సినిమాకు పోయారు.

ఆ ఇల్లు లోపలివైపున వుంది. ముందు ఖాళీస్థలం. అంతా చీకటి. ఆ తాళం చూడగానే తనకొక ఆలోచన వచ్చింది. తాళం పగలకొట్టి చేతికందిన డబ్బూ దస్కమూ తీసికొని ఈ ఊరు వదిలి ఇంకెక్కడికయినా వెళ్ళిపోయి భార్యాబిడ్డలతో సుఖంగా బతుకుదామనుకున్నాడు. పిచ్చ ధైర్యం వచ్చింది. గబగబా ఇంటికెళ్లి పనిముట్లు సంచిని తీసుకొచ్చాడు.

ఇన్ని సంవత్సరాలుగా తన తండ్రీ, తనూ నలుగుర్లో తల ఎత్తుకొని గౌరవంగా తమ కులవృత్తి చేసుకోవటానికి వుపయోగపడిన ఆ పరికరాలను, ఈనాడు ఇలా దొంగతనం చేయటానికి వుపయోగించాడు.

పట్టుబడ్డాడు. అందరిచేతా తన్నులు తిన్నాడు. ఇప్పుడిలా పోలీసు స్టేషన్లో దోషిగా, దొంగగా నిలబడ్డాడు.....

ఈ హృదయ విదారకగాధ వినేసరికి ఇనస్పెక్టరు రమణమూర్తి గుండె నీరయిపోయింది. జీవితాన్ని చూచిన అనుభవమూ, కష్టమూ సుఖమూ తెలిసిన మనస్సూ వున్నవాడు కాబట్టి తనలో తాను మధనపడ్డాడు, బరువుగా నిట్టూర్చాడు.

- 'స్వాతి' మాస పత్రిక

*1973*

★